

కాదు. కానీ ఇది కూడా ఐరోపా దేశమే కావడంతో... వివిధ మార్గాల ద్వారా ఎవరైనా అక్కడ అడుగుపెట్టడానికి దారి దొరుకుతుంది. కార్లలో, ట్రక్కులలో ప్రయాణించవచ్చు. కాలినడకన ప్రయాణించి కూడా బ్రిటన్‌కు చేరుకోవచ్చు.

మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం పదేళ్ల క్రితం దాదాపు 150 మంది భారతీయులు బ్రిటన్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈరోజు 'డంకీ' విధానంలో అనేక అడ్డదారులు కనిపిస్తున్నాయి. అలాగే ఎక్కువమంది బ్రిటన్‌కు బదులుగా అమెరికా వెళ్తున్నారు. డంకీ మార్గంలో అమెరికాలో అడుగుపెడుతున్న వారిలో మనదేశంలో గుజరాత్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి ఎక్కువమంది ఉంటున్నారు.

**మాయమాటలు నమ్మి..**

అమెరికాకు సులువుగా చేరుస్తామన్న తియ్యటి మాటలు నమ్మి చాలామంది బ్రోకర్ల ఉచ్చులో చిక్కుకుంటారు. ఇది మొదటి అబద్ధం కాగా, అక్కడ అడుగుపెట్టగానే మంచి ఉద్యోగం మీకు స్వాగతం పలుకుతుందనేది రెండో అబద్ధం. ప్రయాణంలో కష్టనష్టాలను, అమెరికాలో కఠినమైన చట్టాల గురించి వివరిస్తే అడ్డదారుల్లో వెళ్లాలనుకునే వాళ్లు వెనకా ముందూ ఆలోచిస్తారు. కానీ డబ్బు ఆశతో బ్రోకర్లు నిజాలు దాచిపెడతారు. వీసా పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నవాళ్లు ఇది తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్న భావనతో బ్రోకర్లు చెప్పినట్టల్లా నడుచుకుంటారు. ఇందుకోసం ఆస్తులను తెగనమ్ముకుంటారు. జీవితకాలం పాటు దాచుకున్న డబ్బుల్ని పణంగా పెడతారు. అందమైన భవిష్యత్తు కోసం అప్పులు చేస్తారు. చిట్టచివరకు మధ్యవర్తులు, ఏజెంట్లు, బ్రోకర్ల చేతిలో మోసపోయి లబోదిబోమంటారు.

**ఊరించే ప్యాకేజీలు**

అమెరికా వెళ్లడానికి సంబంధించి రకరకాల ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని బ్రోకర్లు నమ్మబలుకుతారు. డీలక్స్ ట్రావెల్ ప్యాకేజీ అంటే.. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఇవ్వటం, అలాగే ప్రయాణానికి సహకరించటం లాంటివి ఇందులో ఉంటాయి. తక్కువ బడ్జెట్‌లో పని పూర్తి కావాలంటే.. ఏజెన్సీలు మిమ్మల్ని సరిహద్దు దగ్గర వదిలేస్తాయి. మిగిలిన దూరం కాలినడకన ప్రయాణించవలసి ఉంటుంది. ఎంచుకున్న ప్యాకేజీ ప్రకారం.. ఏజెన్సీలు 35 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు, కొన్నిసార్లు కోటి రూపాయల దాకా వసూలు చేస్తున్నాయి. కానీ రెగ్యులర్ వీసాకు ఇంత ఖర్చుచేయాల్సిన పని లేదన్న ఆలోచన కలిగితే ఎవరూ ఈ మార్గంలోకి రారు. కావాలని కష్టాలను కొని తెచ్చుకోరు.



**అమెరికా శరణార్థులుగా...**

ఆయా వ్యక్తులు సరిహద్దు దాటిన తర్వాత ఏం చేస్తారు? పోలీసుల నుంచి తప్పించుకుంటూ రహస్యంగా జీవిస్తారా? అంటే అదేం లేదు. ఆశ్చర్యకరంగా చాలామంది సరిహద్దుల్లో కావలి కాస్తున్న సరిహద్దు నిఘా సిబ్బంది ఎదుట లొంగిపోతారు. అధికారుల నుంచి దాగుడుమూతలు ఆడటం కాకుండా అక్కడున్న వారిని కలిసి వాళ్లు చెప్పినట్టల్లా నడుచుకుంటారు. ఇందుకు కారణం అమెరికా గడ్డమీద అడుగుపెట్టగానే ప్రభుత్వం నుంచి వాళ్లు రక్షణ కోరుకోవటం. దాన్ని 'ఎసైలం' (శరణుకోరడం) అంటారు. ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ నిర్వచనం ప్రకారం.. ఎసైలం కోరుకునే వ్యక్తికి సంబంధిత దేశం తమ దేశంలో నివసించేందుకు అంగీకరిస్తుంది. అలాగే వారికి రక్షణ కల్పించేందుకు సమ్మతిస్తుంది. ఇందుకు 'డంకీ రూట్'లో పరాయి దేశానికి రావటానికి గల కారణాలను బాధితులు నివేదించుకోవాలి. ఇందులో ఐదారు రకాలు ఉంటాయి. తమ స్వదేశంలో ఏ రకమైన వివక్షను ఎదుర్కొన్నారో వాళ్లు వివరించవలసి ఉంటుంది. అది రాజకీయపరంగానా, మతపరంగానా, జాతి, కుల పరంగానా? ఎలాంటి వివక్షను ఎదుర్కొన్నారు అనేది చెప్పగలగాలి. మహిళలు, ఎల్జీబీటీ సమాజంలో ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని చెప్పాలి. ఇలాంటి నేపథ్యం ఉన్నప్పుడు కొన్నిసార్లు ప్రాణాంతకమైన పరిస్థితులు ఏర్పడతాయి. సాంకేతికంగా మరెన్నో రకాల పరిస్థితులు ఉన్నా ఎక్కువమంది ప్రస్తావించే అంశాలు వీటిలో ఏవో ఒకటి అయ్యుంటాయి.

ఎసైలం కోరుకునే వ్యక్తులు తమ పరిస్థితిని ఇమ్మిగ్రేషన్ కోర్టులో.. జడ్జి ముందు నివేదించుకోవాలి. దీన్ని పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనేది న్యాయమూర్తి నిర్ణయంపైన ఆధారపడి ఉంటుంది.

ఇకపోతే తాము ప్రస్తావించే అంశాలు యథార్థమైనవని నిరూపించగలగాలి. అది అబద్ధమని తేలితే బహిష్కరణ (డిపోర్టేషన్)కు గురవుతారు. అబద్ధం చెప్పి పట్టుబడితే ఆ వ్యక్తిమీద నిషేధం విధిస్తారు. అప్పుడు అప్పటి దాకా ఖర్చుపెట్టిన లక్షల సొమ్ము దుర్వినియోగం కావటంతోపాటు భవిష్యత్తులో చట్టపరంగా కూడా అమెరికాలో అసలే అడుగుపెట్టలేని పరిస్థితి దాపురిస్తుంది.

**అంత సులువు కాదు**

ఎసైలం విధానంలో వ్యక్తులు ఎన్నో కష్టాలను భరించవలసి ఉంటుంది. దర్యాప్తునకు నెలల తరబడి, కొన్నిసార్లు సంవత్సరాలు గడిచిపోతాయి. అన్ని రోజుల తర్వాత కూడా అబద్ధం చెబుతున్నారని తేలితే ముందే చెప్పినట్టు బహిష్కారానికి గురికావలసి వస్తుంది. మరో విషయం ఒక వ్యక్తి సరిహద్దులు దాటి ఆ దేశంలో అడుగుపెట్టిన వెంటనే ఇమ్మిగ్రేషన్ కోర్టులో హాజరుపరచరు. ముందుగా వారిని డిటెన్షన్ సెంటర్‌కి తరలిస్తారు. అక్కడ పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉంటాయి. ఒక చిన్నగదిలో లెక్కలేనంత మంది కిక్కిరిసి ఉంటారు. అధికారుల పిలుపు వచ్చేవరకూ అక్కడ కొన్ని వారాలపాటు, ఒక్కోసారి నెలల వరకు గడపాలి. మీకు బయటికి వెళ్లే స్వేచ్ఛ ఉండదు. ఇతరులతో గడపటానికి అనుమతించరు. ఇలాంటి పరిస్థితుల్లో గడపటం అనేది ఎవరికైనా దుర్భరంగా ఉంటుంది. అదీకాక పేదరికం తదితర కారణాల వల్ల చట్టపరమైన సలహాలు, సంప్రదింపులకు కూడా ఆస్కారం ఉండదు.

**అమెరికా, భారత్ చర్యలు**

అక్రమ వలసలను అడ్డుకునేందుకు అమెరికా పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేసింది. నిఘాను, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసింది. దీనికి సంబంధించిన మౌలిక వసతులను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టింది. ఈ అంశంలో దౌత్యపరంగా ముందుకువెళ్లి అమెరికాతో చర్చించేందుకు భారత్ ముందుకువచ్చింది. తగిన పత్రాలు లేకుండా అమెరికాలో అడుగుపెట్టినవారిని వెనక్కి తీసుకునేందుకు సంసిద్ధత ప్రకటించింది. ఈమేరకు అమెరికా నుంచి అక్రమ వలసదారులు భారత్‌కు తిరిగి వస్తున్నారు. అలాగే చట్టపరంగా వీసాలు పొందటానికి ఉన్న అవకాశాలను మెరుగుపరచటం, సురక్షితమైన, చట్టపరమైన వలసలను ప్రోత్సహించడం, అక్రమ వలసదారులకు సంబంధించిన సమాచారం ఇచ్చి పుచ్చుకోవటంలో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఇది నిజంగా శుభ పరిణామం. అది అక్రమ వలసలపైన ప్రభావం చూపుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

